# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-10-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. నంద్యాల జిల్లాలోని శ్రీశైల శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు దర్శించుకున్నారు.
2. రాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీఎస్టీ సంస్కరణలపై కర్నూలులో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు.
3. విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న గూగుల్ డేటా సెంటర్ దేశానికే తలమానికంగా నిలుస్తుందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు.
4. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది.
5. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.

==========================

నంద్యాల జిల్లాలోని శ్రీశైల శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు దర్శించుకున్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా శ్రీశైలం ఆలయం వద్దకు చేరుకున్న ప్రధానమంత్రికి అర్చకులు, ఆలయ అధికారులు లాంఛనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబదేవికి ఖడ్గమాల, కుంకుమార్చన పూజలు చేశారు. పూజల అనంతరం శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ శివాజీ దర్బార్ హాల్, ధ్యాన మందిరాలను తిలకించారు. ప్రధానమంత్రితో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ శ్రీశైలంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

కాగా అంతకుముందు కర్నూలులోని ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్న ప్రధానమంత్రికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ స్వాగతం పలికారు.

--------------------------

రాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీశైలం పర్యటన అనంతరం హెలికాప్టర్‌లో కర్నూలులోని నన్నూరుకు చేరుకుంటారు. అక్కడ రాగమయూరి గ్రీన్ హిల్స్ వద్ద జీఎస్టీ సంస్కరణలపై నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. అనంతరం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13 వేల 400 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. తర్వాత ఢిల్లీకి తిరిగి వెళ్తారు.

--------------------------

పర్యావరణ పరిరక్షణకు దోహదపడే వలయ ఆర్థిక వ్యవస్థపై విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మెన్ కృష్ణయ్య తెలిపారు. తిరుపతిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వలయ ఆర్థిక వ్యవస్థ, వ్యర్థాల పునర్వినియోగ విధానంపై జరిగిన మేధోమథన కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మెన్ మాట్లాడుతూ, ప్రతి వస్తువుని వ్యర్థం అని కాకుండా వనరుగా చూడాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యర్థ నిర్వహణ, వ్యర్థాల పునర్వినియోగంపై కొత్త విధానాన్ని తీసుకువచ్చిందని తెలుపుతూ,

వాయిస్..31 సెకన్లు

---------------------------

విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న గూగుల్ డేటా సెంటర్ దేశానికే తలమానికంగా నిలుస్తుందని విశాఖ జిల్లా ఇన్ చార్జ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. 16 నెలల్లోనే విశాఖకు 6 లక్షల 50 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు.రాంబిల్లిలో న్యూక్లియర్ సబ్ మెరైన్ బేస్, భోగాపురం విమానాశ్రయం, మూలపేట పోర్టు, ఫార్మా పార్కు, హోటళ్లు, కోస్టల్ కారిడార్, రైల్వే జోన్, మెట్రో వంటి వైవిధ్యమైన ప్రాజెక్టులతో విశాఖ ప్రగతి బహుముఖాలుగా విస్తరిస్తోందన్నారు. ఒప్పందాలు, భూకేటాయింపులు పూర్తయిన మరిన్ని సంస్థలు కార్యకలాపాలను మొదలుపెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా సంయుక్త కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పార్వతీపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వసతి గృహ విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై ఆయన ఈరోజు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వసతి గృహాల్లో పిల్లలందరికీ వైద్యాధికారుల ద్వారా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరికీ హెల్త్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికీ వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి అని పోషకాహారం, ఆరోగ్య సంరక్షణపై విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

---------------------------

దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రేపు, ఎల్లుండి తెలుగు రాష్ట్రాల నుంచి వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈరోజు ఒక ప్రకటనలో తెలియజేశారు. రేపు 07611 నెంబర్ కలిగిన హెచ్ఎస్ నాందేడ్–సీఎస్టీ ముంబై, 07097 నెంబర్ కలిగిన చర్లపల్లి–అనకాపల్లి రైళ్లు నడుస్తాయని తెలిపారు. ఎల్లుండి 01021 నెంబర్ కలిగిన సీఎస్టీ ముంబై–కరీంనగర్, 01022 నెంబర్ కలిగిన కరీంనగర్–సీఎస్టీ ముంబై, 07098 నెంబర్ కలిగిన అనకాపల్లి–చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు పేర్కొన్నారు.

---------------------------

ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలో "సూపర్ సేవింగ్స్ సూపర్ జీఎస్టీ" కార్యక్రమంలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో కార్లు, ఆటోలతో అవగాహన ర్యాలీని ఈరోజు నిర్వహించారు. నూజివీడు బస్టాండ్ నుండి చిన్న

గాంధీ బొమ్మ కూడలి వరకు జరిగిన ఈ ర్యాలీని నూజివీడు మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న నూజివీడు రవాణా శాఖ అధికారి బాలేంద్ర శేఖర్ మాట్లాడుతూ,

వాయిస్ .. 27 సెకన్లు

---------------------------

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందజేయడం, ఆహార వృథాను అరికట్టడం వంటి అంశాల పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహిస్తున్నారు. పెరుగుతున్న ప్రపంచ జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తిని పెంచడం, పోషకాహార ప్రమాణాలను కాపాడడం, ఆహార వ్యర్థాలను అరికట్టడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1945 అక్టోబర్ 16వ తేదీన ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ ఏర్పాటైన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఈరోజు ఆహార దినోత్సవం జరుగుతోంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 24వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో.. రానున్న మూడు రోజులపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ..

..వాయిస్.. 16 సెకన్లు

---------------------------

గుండెపోటు వచ్చినప్పుడు అందించవలసిన సిపిఆర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. సి.పి.ఆర్ అవగాహన వారోత్సవాలలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆమె నిన్న పాల్గొని సిపిఆర్ ప్రక్రియను చేసి చూపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ప్రాణరక్షణకు ఉపయోగపడే సి.పి.ఆర్ నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పక్రియపై అవగాహన కలిగి ఉంటే ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడడానికి వీలవుతుందని తెలిపారు.

====================